# మొహబ్బత్ ఖాన్

-శ్రీ శ్రీ

రాజుగారు నపుంసకుడు. అందుచేత రాజ్యంలో రతినిషేధం విధించారు. అయితే దానికి నిర్బంధ బ్రహ్మచర్య చట్టం అని ఒక పారిభాషిక పదం సృష్టించి ఆ పిమ్మట జారీ చేశారు. యథా రాజా తథా ప్రజా అని శ్రుతి స్మృతి పురాణాదులు వేనోళ్ళ ఘోషించడం రాజుగారికి తెలియని విషయమేమీ కాదు. రాజులాగే ప్రజలు కూడా మారినప్పుడే దేశమంతా (అంతా కలిసి పాతిక మూప్పయి చదరపు మైళ్ళని మించి ఉండక పోయినా) శాశ్వతంగా శాంతి సౌఖ్యాలలో ఓలలాడుతుందనే గట్టి నమ్మకంతోనే మహానుభావుడు మన్మథ కార్య నిషేధానికి చట్టరూపం తెచ్చి దేశం మీద ప్రయోగించాడు.

ఈ కథాకాలం ఇప్పటికి అయిదు వందల సంవత్సరాలకు పూర్వమే అయినా, రాజుగారిది మెచ్చుకోదగ్గ గొప్ప ప్రజాస్వామిక దృక్పథం. రకరకాల ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పదిహేను మంది మేధావులను సమావేశపరిచి తన అభిప్రాయాన్ని చర్చకు పెట్టారు. సభాసదుల్లో యిద్దరు తప్ప మిగిలిన వాళ్ళంతా రాజుగారు తమ అభిప్రాయాన్ని ప్రకటించక ముందే ఆ అభిప్రాయంతో బేషరతుగా ఏకీభవించిన రాజభక్తి పరులు. రాజుగారు తీర్మానం ప్రవేశపెట్టగానే, "జై వీరాంజనేయ!", "జై భీష్మాచార్య" అనే నినాదాలతో తమ సమ్మతిని తెలియజేశారు. ఇంత ప్రాచీనమైన సంఘ సంస్కారాన్ని పునరుద్ధరించడంలో రాజుగారి ముందు చూపునూ, భవిష్యత్తు పట్లగల వారికిగల అకుంఠిత విశ్వాసాన్నీ, స్వచ్ఛమైన భాషలో సముచితంగా పొగుడుతూ టూకీగా ఉపన్యాసాలు చేశారు.

ప్రజాస్వామ్యంలో విభిన్నాభిప్రాయాలుండడం సహజమే అని రాజుగారికి తెలుసును కాబట్టి చేతులెత్తని ఇద్దరికీ, ఇతర బర్బర నియంతల్లాగ తక్షణ మరణ శిక్ష విధించలేదు. వారిలో ఒకడు తన ఆస్థాన కవి కాంస్య వృషభ క్రియాశక్తి. రెండోవాడు సాక్షాత్తూ తన ప్రధాన మంత్రి. "కవిగారూ, ఏమిటి మీ అభ్యంతరం?" అని రాజుగారు ప్రశ్నించారు. "మరేం లేదు మహాప్రభూ! మన మహాకవులంతా శృంగారాన్ని రసాధిదేవతగా కీర్తించారు. ఈ యొక్క కొత్తచట్టంవల్ల ఆ యొక్క అ[illegible]రాఘ రసం పూర్తిగా యింకి పోతుందే[illegible]రా అని భయపడుతున్నాను. జీవితంలో యిక రుచి అనేదే మిగలదని నాకు తోస్తుంది" అని సవినయంగా మనవి చేసుకున్నాడు క్రియాశక్తి. రతి కార్యంలో రుచి అంటూ ఏమీ లేదని స్వానుభవంతో తెలుసుకున్న రాజుగారు కవిగారి అభ్యంతరాన్ని తోసిరాజన్నాడు. అప్పుడు ప్రధానమంత్రి ఏకాకి అయిపోయినట్లు గ్రహించి తటస్థంగా ఉండిపోతానని తప్పుకోవడానికి ప్రయత్నించాడు. "అలా కాదు. మాకు తట్టని మహత్తర కారణాలు మీ దగ్గర ఉండవచ్చును. అందువల్ల అల్ప సంఖ్యాకులు అధిక సంఖ్యాకులుగా మారిపోయే అవకాశం కూడా ఉంది. కాబట్టి సంకోచం లేకుండా మీ అభిప్రాయాన్ని మనవి చేసుకోవచ్చు" నన్నారు రాజుగారు. "ఇది ప్రకృతి విరుద్ధం అని నాకు తోస్తుంది" అన్నాడు మంత్రిగారు ముక్తసరిగా.

అందులో ఎంత హాస్యం ఉందో ఏమో గాని రాజుగారు పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వడం మొదలు పెట్టారు. తర్వాత సభా మర్యాదలు గుర్తుకొచ్చి మళ్ళీ స్థిమిత పడి, "మంత్రిగారూ! ఇంతేనా, ఏమిటో అనుకున్నాను?... ప్రకృతి శక్తులను జయించడమే మానవుడి లక్షణం. ప్రకృతికి బానిసగా పడి ఉండే పాతకాలపు అలవాట్ల నుండి మానవుడు బైట పడేవాడు కాదు. అంచేత మీ వాదంలో పస లేదు. విప్లవాత్మకమైన ఈ శాసనాన్ని విజయవంతంగా అమలు చేస్తే భావి చరిత్రకారులు నా పేరు సువర్ణాక్షరాలలో లిఖిస్తారని మరచిపోకండి. దయచేసి ఆ కీర్తి నాకు దక్కనివ్వండి. కాదూ పోదూ

అని మీరంతా తీర్మానానికి వ్యతిరేకిస్తే ఈ క్షణమే దాన్ని ఉపసంహరించుకోవడానికి సంసిద్ధుణ్ని" అన్నారు రాజుగారు తీర్మానం నెగ్గిపోయిందన్న ధైర్యంతో.

అలాగే తీర్మానం నెగ్గింది. ఆనాటి అర్ధరాత్రి నుంచీ రతి నిషేధం అమలులోకి వచ్చింది. ఆస్థాన కవి అసమ్మతి సూచకంగా దేశాన్ని వదలిపెట్టి వెళ్ళిపోయాడు.

శాసన పాఠాన్ని రాళ్ళ మీద, రాగి రేకుల మీదా చెక్కించారు. తాటాకుల మీద రాయించారు. మూల మూలలా దండోరాలు వేయించారు. ఇందువల్ల చాలామందికి ఉద్యోగాలు లేకపోయినా, వ్యాపకాలు దొరికాయి. వాటినే సద్యోగాలంటారు కాబోలు.

రాజుగారు శాసనమైతే జారీ చేశారు గాని దాన్ని సజావుగా అమలు జరపడం మాటలా? అందుకు చాలా అదనపు సిబ్బంది కావలసి వచ్చింది. ఆ సిబ్బందిని పోషించడానికి అదనపు పన్నులు వెయ్యవలసి వచ్చింది. శాసనాన్ని కఠినంగా అమలు చెయ్యాలని ఉత్తరువు తీసుకున్న రక్షక భట శాఖలోనే చాలా మంది రతి నిషేధ వ్యతిరేకులున్నారని రాజుగారి గూఢచారులు రహస్య పత్రాలు దాఖలు చేసుకుంటున్నారు. గూఢచారుల్లో కూడా చట్టంపట్ల తీవ్ర వ్యతిరేకత ఉన్నట్లు తెలిసిన వారు కాబట్టి రాజుగారు సులువుగానే పసికట్టారు.

శాసనాన్ని కట్టుదిట్టంగా అమలు చెయ్యడానికి మొదటి చర్యగా రాజుగారు వివాహ వ్యవస్థ రద్దు చేశారు. వివాహితులందరూ నిర్బంధంగా విడాకులు తీసుకోవాలని కట్టడి చేశారు. ఇందువల్ల న్యాయస్థానాల సంఖ్య పెరిగినా నిరుద్యోగుల సంఖ్య తరిగింది. రాజుగారికి మరో ప్రశస్తమైన ఆలోచన తోచింది. ఆడదాన్ని మొగాడూ – మొగాణ్ని ఆడదీ చూస్తేనే కదా రతిక్రియకి అవసరమూ, అవకాశమున్నూ? కాబట్టి తన రాజ్యంలో స్త్రీలనూ, పురుషులనూ వేరుచెయ్యాలి. ఇందుకు వీలుగా దేశం మధ్యని, ఉత్తర సరిహద్దు నుండి దక్షిణ సరిహద్దు దాకా ఇరవై అడుగుల గోడ నిర్మించాలి. తూర్పు వైపున స్త్రీలనూ, పడమటి వైపు పురుషులనూ కేటాయించాలి. ఇందుకో ఐదేళ్ళు పట్టవచ్చును గాక. అయినా ఇదే అత్యుత్తమమైన మార్గం.

ఇదే ప్రపంచంలో మొట్టమొదటి పంచవర్ష ప్రణాళిక అని కొంతమంది చరిత్రకారుల ఉద్దేశం.

అడ్డుగోడ నిర్మాణం నిరాటంకంగా జరిగిపోతోంది. వందలాది కూలీలకు చేతినిండా పని దొరికింది. చరిత్రలో మొదటిసారి నిరుద్యోగాన్ని నిర్మూలించిన ఘనత కూడా మన రాజుగారికే దక్కింది. గోడ లేవడానికి ముందే తూర్పు వైపంతా ఆడవాళ్ళూ, ఎడమ వైపంతా మొగవాళ్ళూ తోలబడ్డారు. గోడకి రెండు వైపులా నూరేసి గజాలకు ఒకొక్కడి చొప్పున ఆరక్షక భటుల నియామకం జరిగింది. ఇటున్న మొగాళ్ళని అటూ, అటున్న ఆడవాళ్ళని ఇటూ రాకుండా అటకాయించడమే వాళ్ళ నిత్య విధి. రాజుగారు తరచూ, నిజస్వరూపంతో గుర్రంమీద ఒకప్పుడూ, మారువేషంతో కంచర గాడిదమీద ఎక్కి మరొకప్పుడూ పర్యవేక్షణ జరుపుతున్నారు. శాసనం ఉల్లంఘించిన వాళ్ళకి ఆరునెలలు మొదలు ఏడాది దాకా కారాగార శిక్ష. కానీ ఎందువల్లనో చెరసాలలన్నీ పలచగానే ఉన్నాయి. స్త్రీ పురుషులు ఒకర్నొకరు కలుసుకోవడానికి ఎటువంటి కొత్త ప్రక్రియలు కనిపెట్టేరో, అందుకు రక్షక భటుల సహకారం ఎంతవరకూ ఉందో చరిత్రకారుల పరిశీలనకు వదిలేద్దాం.

ఈలోగా ప్రధాన మంత్రి రాజుగారికో పెద్ద తలనొప్పి తెచ్చిపెట్టాడు. నిర్బంధ బ్రహ్మచర్య చట్టం పూర్తిగా విజయవంతమయితే, వచ్చే తరానికి మనుష్యులే మిగలరనేది అతని వాదన... దీన్నలా అలా కొట్టి పారెయ్యడానికి వీల్లేదు. దీర్ఘంగా ఆలోచించవలసిన సమస్యే ఇది! మరయితే దీన్నెలా పరిష్కరించడం?

రాజుగారు తన ఆంతరంగిక ఆలోచనా మందిరంలో కూర్చుని దీక్షగా సమస్యను అధ్యయనం చెయ్యడం ప్రారంభించారు. శాస్త్రీయంగా విశ్లేషణ చేసి ఈ సమస్యకు రెండు ధ్రువాలన్నట్లు నిర్ణయించారు. ఒకటి, రతికార్యం జరగకూడదు. రెండు, ప్రజావృద్ధి జరగాలి. పరస్పర వ్యతిరేకమయిన యీ విభిన్న ధ్రువాలను సమన్వయపరచడం ఎలా?

సంఘంలో సమర్థులూ, సత్పురుషులూ అయినవాళ్ళ కొంతమందిని ఎంపిక చేసి వాళ్ళు మాత్రం తూర్పు వైపు వెళ్ళడానికి–అదయినా నెలకు రెండు, మహా అయితే మూడు మార్లు మాత్రమే వెళ్ళడానికి – అనుమతిస్తూ రాగి బిళ్లలను మంజూరు చేస్తే? చాలా బాగుంది. నిర్బంధ బ్రహ్మచర్యానికి అపవాదంగా స్వచ్ఛంద వ్యభిచారం. ముఖ్యంగా సైన్యంలో ఒక పెద్ద అసంతృప్తి వ్యాపించినట్లుంది. కాబట్టి ముందుగా వాళ్ళని హెచ్చు సంఖ్యలో తృప్తి పరచాలి. పోనీ వాళ్ళని పెళ్ళిచేసుకోనిస్తే? వీల్లేదు. అప్పుడు చట్టం ఉద్దేశమే విఫలమయి పోతుంది. బాగుంది, రాగి బిళ్ళల పద్ధతి చాలా బాగుంది.

సైన్యం తర్వాత ఈ చట్టం అంటే లోలోపల అసహ్యించుకుంటున్న వాళ్లెవరూ? మరెవరు? మన కుర్ర కవులు. వీళ్ళచేత ప్రబంధాలు చదవడం మాన్పించినా, భజన కీర్తనలు వ్రాయించి పారితోషికాలిస్తున్నా దొంగతనంగా వీళ్ళు నిషిద్ధ సంస్కృత సాహిత్యాన్ని చదువుతున్నట్లు రాజుగారికి తెలుసు. అంచేత ఎందుకొచ్చిన గొడవ? వీళ్ళం


దరికీ తలో రాగి బిళ్ళా పారేస్తే... వీల్లేదు వీళ్ళని తూర్పు దిక్కు వెళ్ళనియ్యనే కూడదు. వెళ్ళనిస్తే ఇంకేమైనా ఉందా?

రాజుగారి మానసిక వ్యథల జాబితా ఇంతటితో పూర్తికాలేదు. తన తదనంతరం ఎవరీ దేశాన్ని పాలించాలి? నాన రాకటా, ప్రాణ పోకటా చెప్పలేం కదా? హఠాత్తుగా ఈ త్రివిక్రమ కీర్తి భూపాలుడు హరీ అంటే, ఆ తర్వాత పడమటి కొండల అవతల వున్న తన దాయాది హరిశ్చంద్ర కీర్తి అమాంతంగా, ఒక్క నెత్తురు చుక్కయినా చిందించని అహింసాత్మకంగా యీ దేశాన్ని తన రాజ్యంలో విలీనం చేసుకుంటాడు. అందుకు ధర్మశాస్త్రం కూడా అంగీకరిస్తుంది. తాను మరణించిన తర్వాత మరెవ్వరు రాజయినా మంచిదే కాని ఆ హరిశ్చంద్ర కీర్తిగాడు మాత్రం ఈ గడ్డ మీద అడుగు పెట్టకూడదు.

పరమపదించిన వాళ్ళ నాన్న నారసింహ కీర్తిగారికి పట్టమహిషితో బాటు వందకి పైగా భార్యలున్నారు. చచ్చిపోయిన వాళ్ళు కాక, వయసు చెల్లిన వాళ్ళు కాక ఇంకా తగు మాత్రం తన అంతఃపురంలోనే ఉన్నారు. ఇన్నాళ్లూ వాళ్ళందరినీ తాను మాతృభావంతోనే చూసుకుంటూ వచ్చాడు. రాజ్యానికి వచ్చిన కొత్తల్లోనే వారసత్వపు ప్రశ్న రాజుగార్నెదుర్కొంది. అప్పటికే వారి నపుంసకత్వం జగత్ప్రసిద్ధం. పెద్దరాజుగారు పోయాక, దిన వారాలన్నీ సక్రమంగా జరిగి పోయాక మన రాజుగారు అంతఃపురంలోని మాజీ మహారాణుల్లో ఏ ఒక్కరైనా గర్భం ధరించి ఉంటారేమో అని పరమ రహస్యంగా ఆరాలు తీయించారు. ఒక నలభయ్యేళ్ళ రాణీగారు గర్భవతి అని తెలిసింది, కాని ఏ వ్రతలోపం వల్లనో, ఏ గ్రహచారం వల్లనో ఆవిడగారికి ఆరో నెల్లోనే గర్భస్రావమయి పోయింది. రాజవైద్యులు పిండాన్ని పిడతలో పెట్టి ప్రాణప్రతిష్ఠ చెయ్యడానికి ఎన్నెన్ని విశ్వ ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది.

అడ్డ గోడ నిర్మాణం ప్రారంభించి ఐదేళ్ళు దాటిపోయాయి. బ్రహ్మాండంగా దేశం ఈ చివరినించి ఆ చివరికి అడ్డగోడ లేచింది. రతి నిషేధం విజయవంతమవుతున్నందుకు సంతోషించాలో, రాజవంశం నిర్మూలమవుతున్నందుకు దుఃఖించాలో తెలియడం లేదు రాజుగారికి.

అలాంటి సమయంలోనే అవతార పురుషుల ఆవిర్భావం జరుగుతుంది. ఇప్పుడు అదే జరిగింది.

MICROSCOPES

*Imported From CZECHOSLOVAKIA*

and widely used for

BIOLOGICAL
ENGINEERING
CLINICAL
INDUSTRIAL
RESEARCH LABORATORIES

available ex-stocks. Please contact.

*Sole selling Agents:*

**VIJAYA SCIENTIFIC EQUIPMENTS**

*Head Office:*

**Congress Office Road,**
**Vijayawada-2 (A. P.)**

*Branches at:*

**5-9-236**
**Abid Road,**
**HYDERABAD-1**

**895, Block V**
**Rajajinagar,**
**BANGLORE-10**

పడమటి కొండల్లో ఒక గుహలో కొంతమంది మొగాళ్ళకి ఒక యోగి పుంగవుడు కనబడ్డాడు. తన పేరు నిధువనానందస్వామి అనీ, నూర్ళ నించీ ఆ గుహలోనే సమాధిలో ఉన్నాననీ చెప్పాడు. వారం రోజుల్లో ఆయన మాహాత్మ్యం గురించి కోకొల్లలు కథలు వ్యాపించాయి. అవి రాజుగారి చెవిని కూడా పడ్డాయి.

రాజుగారు ఒక గెల అరటి పళ్ళూ, ఒక కుండెడు పాలూ తీసుకు వెళ్ళి యోగీశ్వరుణ్ని తమ గృహం పావనం చెయ్యమని కాళ్ళా వేళ్ళా పడ్డారు. పాలు తాగి, పరమానందభరితులైన నిధువనానందస్వామి రాజుగారితో అంతఃపురానికి వెళ్ళారు. అక్కడే ఒక మండలం పాటు సకల పరిచర్యలూ స్వీకరించి నలభై ఒకటో రోజు రాత్రి అంతర్ధానమయి పోయారు.

ఈ సంఘటనల వరసలో తరువాతిది కీ. శే. నారసింహాకీర్తి గారి వితంతువు అందరితో అందమైన రాణిగారు గర్భం ధరించడం. వచ్చిన మొదటి రోజే, అచిరకాలంలో నీకో తమ్ముడు పుట్టబోతున్నాడని హామీ ఇచ్చారు యోగిపుంగవులు రాజుగారికి. అలాగే పది నెలలు తిరిగేసరికి తమ్ముడు పుట్టనే పుట్టాడు.

అన్నిటికన్నా ఆశ్చర్యం ఏమిటంటే తూర్పు భాగంలో ఉన్న చాలా మంది గర్భం ధరించారు. ఒక్కొక్క నెల గడుస్తూ ఉంటే పిల్లల్ని కూడా కనేస్తున్నారు. పురుష సంపర్కం లేకుండా రాణిగారికి కొడుకు పుట్టినట్టే తతిమ్మా వాళ్ళకి కూడా పిల్లలు పుట్టడానికి నిధువనానందస్వామి వారి చలవే కారణం అని రాజుగారు విశ్వసించారు. దీనితో తన సమస్యా, జనాభా సమస్యా రెండూ తీరిపోయినందుకు సంతోషించారు.

రెండేళ్ళు గడిచాక అంతఃపురంలో యోగిపుంగవులు మళ్ళీ సాక్షాత్కరించారు. రాజుగారు స్వామివారికి కృతజ్ఞతలతో సాష్టాంగ దండ ప్రణామం చేశారు. యోగీశ్వరులిచ్చిన విభూతి స్వీకరించారు. యోగీశ్వరులు రాజుగారు తెప్పించిన విప్పసారా పసందు చేస్తున్నారు.

ఇప్పుడు వేగుల వాళ్ళు పరుగెత్తుకొస్తూ అంటూ, దేశం మీదికి పెద్ద తురకల దండు వచ్చి పడిందని మొత్తుకున్నారు.

ఈసారి రాజుగారూ, యోగీశ్వరుడూ ఇద్దరూ అంతర్ధానమయి పోయారు.

తురకల దండును ఢిల్లీ నించి తీసుకొచ్చినవాడు ఆస్థాన కవి కాంస్యవృషభ క్రిరాశక్తి. ఎలా ఢిల్లీ వెళ్ళాడో, ఎలా పారశీక భాష నేర్చుకున్నాడో, ఎలా కోటలో పాగా వేశాడో ఏమో. ఎడతెగని అతని కృషి ఫలితంగా తురక సేనలు రాజుగారి ముఖ్య పట్టణంలో ప్రవేశించాయి.

తురక సేనాని పెద్దమనిషి. తనకు స్వాగతం యిచ్చిన తెల్ల జెండాలను అంగీకారం చేసుకున్నాడు. సైన్యాలన్నిటినీ నలుగురు దండనాయకుల అధికారం కింద ఢిల్లీకి పంపించేశాడు.

తర్వాత నాలుగైదు రోజులకి ప్రజల్లో భీతావహం తగ్గిందని తేల్చుకున్నాక ఆరుబైటను పెద్ద దర్బారు చేశాడు.

"మిమ్మల్నందరినీ తురక మతంలో చేర్చే ఉద్దేశం నాకు లేదు" అన్నాడు. కరతాళధ్వనులు మిన్నుముట్టాయి.

"మీ త్రివిక్రమ కీర్తి గారి చిన్న తమ్ముడికి పట్టాభిషేకం చేసి అతను పెద్దవాడయేదాకా నేను పరిపాలిస్తాను: మొట్టమొదట రతి నిషేధాన్ని రద్దు చేస్తున్నాను (చప్పట్లు). వివాహ వ్యవస్థను పునరుద్ధరిస్తున్నాను (అక్కడక్కడ చప్పట్లు). అయితే ఒక్క షరతు. ఈ విషయంలో మీ హిందూ న్యాయశాస్త్ర ప్రకారం కాక, మా మహమ్మదీయ షారియాత్ ప్రకారం ఒక పురుషుడు అయిదుగురు భార్యల దాకా వివాహం చేసుకోవచ్చు (పెద్ద పెట్టున చప్పట్లు).

"ఔను. తప్పేముంది? భారతంలో ఒక స్త్రీకి అయిదుగురు భర్తలయితే ఇప్పుడు ఒక పురుషుడికి అయిదుగురు భార్యలు. బాగానే ఉంది" అనుకున్నారందరూ.

ఇదంతా సేనాని పారశీక భాషలో ఉపన్యసిస్తే ఆస్థాన కవి తెలుగులోకి తర్జుమా చేశాడు.

సేనానికి ఒకే ఒక్క విషయం అంతు పట్టలేదు. రాణీగారికే కాక వేలాది స్త్రీలకు కూడా స్వామివారే గర్భదానం చేశారా అని...ఏమో! హిందువుల్లో మాత్రం ఎందుకు మహానుభావులుండకూడదు—అనుకున్నాడాయన.

అడ్డగోడ కింద ఇటు నుంచి ఆడవాళ్ళూ, అటు నుంచీ మొగ వాళ్ళూ తవ్విన సొరంగాలు చాలా ఉన్నాయన్న రహస్యం ఎవరో బయట పెట్టిన తర్వాత సాహెబ్ గారికి సందేహ నివృత్తి అయింది. అయినా ఆడవాళ్ళు గాని, మొగవాళ్ళు గాని తామే ఆ పని చేసినట్టు ఒప్పుకో లేదు. ఇదంతా పందికొక్కుల పనే అయ్యుంటుందన్నారు.

బాలరాజుకి మొహబ్బత్ ఖాన్ అని పేరు పెట్టి మహమ్మదీయ సేనాని పద్నిమిది సంవత్సరాలు రాజప్రతినిధిగా పరిపాలన చేశారు. *